క్లుప్తంగా

రెవెన్యూ రికార్డుల పరిశీలన



రెవెన్యూ రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ

దెందులూరు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం విధి నిర్వహణలో భాగంగా రెవెన్యూ రికార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు పరిశీలించారు. తహసీల్దార్ వీ.జితేంద్ర తహసీల్దార్ కార్యాలయంలో విభాగాలు, పనుల పరిధిపై డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. ఈఓఆర్‌పి, డిప్యూటీ తహసీల్దార్, సీఎస్‌డీటీ, ఎలక్షన్ డీటీ, విధి నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అచ్చమ్మ తల్లి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్‌లో అచ్చమ్మ తల్లి ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేసిన సినీ డైరెక్టర్ బాబి

దెందులూరు: మండలంలోని గాలాయగూడెంలో ఈ నెల 16 నుంచి జరగనున్న శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాల పోస్టర్‌ను సినీ డైరెక్టర్ బాబి గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. గాలాయగూడెం గ్రామానికి చెందిన పెద్దిశెట్టి నాని, వేగుంట వెంకట కిషోర్, కోట నాని, డాక్టర్ కార్తీక్ రవీంద్రజైపాల్, తీగల రమేష్, పూజారి అచ్యుతరామయ్యలతో కలిసి పోస్టర్‌ను విడుదలచేశారు. గతేడాది అమ్మవారి దర్శనానికి విచ్చేశానని, వాల్తేరు వీరయ్య ఘన విజయం సాధించిందని,ఈ ఏడాది సైతం అమ్మవారి దర్శనానికి తప్పకుండా విచ్చేస్తానని పెద్దిశెట్టి నానికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ



మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గురువారం మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలలో అలుగులగూడెం వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను సోదరి చికిత్స పొందుతున్న కుమారిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలు, వైద్యసేవలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యులు మెరుగైన వైద్యసేవలందించాలని తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి నాని ఉన్నారు.


విద్యతోనే అభివృద్ధి



జనరల్ కౌన్సిలర్ సిస్టర్ జూలీకి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపల్ టీనా మరియా

దెందులూరు: విద్యతోనే అభివృద్ధి, అవగాహన ముడిపడి ఉందని, విద్యా విధానంలో నూతన ఒరవడి, నైపుణ్యతలను పెంపొందించాలని జనరల్ కౌన్సిలర్ సిస్టర్ జూలీ (కేరళ) అన్నారు. గురువారం దెందులూరు సెయింట్ మెర్సీ యూపీ పాఠశాలల విద్యా విధానం, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు, పనితీరు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానం, మౌలిక వసతుల కల్పన అన్ని రాష్ట్రాలకు మించి పోటీలో నూరు శాతం సత్ఫలితాల సాధన దిశగా ఉందన్నారు. కేరళ నుంచి పరిశీలించడానికి విచ్చేసిన జనరల్ కౌన్సిలర్‌కు ప్రిన్సిపల్ సిస్టర్ టీనా మరియా స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వానపల్లి ప్రదీప్‌కుమార్

పెదపాడు: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొక్కిరపాడులో మొక్కజొన్న పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ప్రదీప్ కుమార్ ఎరువుల యాజమాన్యం విత్తన ఉత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సాగు చేస్తున్న పంట వివరాలను ఆర్‌బీకే సిబ్బంది ద్వారా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని పంట నమోదు ప్రాముఖ్యతను వివరించారు.

నాడు–నేడుతో బడులు బాగుపడ్డాయ్

- ప్రభుత్వ చర్యలతో కార్పొరేట్ లుక్‌తో ప్రభుత్వ పాఠశాలలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



నాడు–నేడు పథకంలో నూతనంగా నిర్మించిన భీమడోలు నెం.4 పాఠశాల



నిర్మాణం పూర్తి కావచ్చిన పోలసానిపల్లి నెం.1 పాఠశాల

భీమడోలు: నాడు–నేడు పథకం సర్కారీ బడుల పాలిట వరంగా మారింది. నాడు కూలేందుకు సిద్ధం ఉన్న ఉన్నా ప్రభుత్వ బడులు ప్రస్తుతం కార్పొరేట్ వసతులతో ముస్తాబయ్యాయి. ప్రభుత్వం నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ వారిని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితి చేర్చేలా ప్రణాళికలను తయారీ చేసి అమలు చేస్తుంది. విద్యార్థులంతా కార్పొరేట్ లుక్‌తో ఉన్న పాఠశాలలను చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారు. నాడు–నేడు పథకం ద్వారా రెండు దశల్లో ప్రభుత్వ బడుల రూపురేఖలు సమూలంగా మార్చేసింది. తొలి దశలో సర్కారీ బడులు సుందరంగా తీర్చిదిద్దారు. రెండో దశలోని బడుల్లో దాదాపు కావస్తున్నాయి. బాలబాలికల బోధనకు అవసరమైన సాంకేతిక సదుపాయాలు, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, ఇతర వసతులను కల్పించారు. లక్షలాది రూపాయలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాలలు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నాయి.

రెండో విడతలో 21 పాఠశాలలు

మండలంలో రెండో విడత నాడు–నేడు పథకంలో 21 పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు రూ.2.28 కోట్లు మంజూరు కాగా రూ.2.25 కోట్లు నిధులు ఖర్చు పెట్టారు. భీమడోలు నెం.4 ప్రాథమిక పాఠశాల ఓ దళిత వాడలో ఉంది. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరడంతో పాటు చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారేది. అయితే ఎన్నో ఏళ్ల సంబంధిత అధికారులు, పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకున్నా నాథులే కరువయ్యారు. ఈ తరుణంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి నిధులు వెచ్చిస్తూ పాఠశాలలను అభివృద్ధిపర్చే నాడు నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండో విడతలుగా కోట్లాది రూపాయలు వెచ్చించారు. గత ప్రభుత్వ హాయంలో కనీసం వసతులకు నోచుకోని బడులు నేడు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. దీనితో పాఠశాలలను కొత్త భవనాన్ని నిర్మించారు. మరో భవనానికి పూర్తి స్థాయి మరమ్మతులు చేశారు. పోలసానిపల్లి నెం.1 పాఠశాలను నిర్మించారు. అయితే ఈ పాఠశాలకు రంగుల వేయాల్సి ఉంది. మండలంలోని ఇతర పాఠశాలల్లో కూడా పనులు వేగంగా సాగుతున్నాయి.

ఎన్నికల్లో బీఎల్‌ఓల పాత్ర కీలకం



బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకట శివయ్య

ఉంగుటూరు: ఎన్నికల సమయంలో బీఎల్‌ఓల పాత్ర కీలకమని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల బీఓల్‌ఓల సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు పోలింగు బూత్‌లు వద్ద తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. కొత్త ఓటు కోసం చేసుకున్న దరఖాస్తు అభ్యంతరాలను నిశితంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, ఎన్నికల డీటీ పోతురాజు, సీనియర్ సహాయకుడు సాయం రమేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



భీమడోలు: విద్యుత్ సమస్యల పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెదవేగి: విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రుూన్సీలక్ష్మి

భీమడోలు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని విద్యుత్ శాఖ ఏఈ కె.రామస్వామి అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో భీమడోలు సర్కిల్ సెక్షన్ పరిధిలో గురువారం రాత్రి భీమడోలు ఏఈ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో భీమడోలు ఏఈ రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన ప్రజలు, రైతులకు పొరుగు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతులు విద్యుత్ కనెక్షన్లు కోసం దరఖాస్తులను, ఇతర సమస్యల పరిష్కారానికి సచివాలయాలను వినియోగించకుండా మీ–సేవా కేంద్రాలు, ఏపీ ఆన్‌లైన్ వంటి ప్రైవేటు కేంద్రాల వద్ద దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు. ఈ విధానానికి రైతులు స్వస్తి పలకాలని సూచించారు. గ్రామాల్లోని రైతులు విద్యుత్ శాఖ సిబ్బంది, వ్యవసాయ సహాయకుల దృష్టికి సమస్యలను తీసుకుని వెళ్లి వారి ద్వారా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తద్వారా త్వరితగతిన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వచ్చే వేసవి దృష్ట్యా రైతులు వ్యవసాయ బోర్లు కింద కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని, దీని వల్ల లోఓల్టేజ్ సమస్య తీరుతుందన్నారు. రైతులు పొలం గట్ల వద్ద విద్యుత్ వైర్లు వేలాడుతున్నా, బోర్ల వద్ద ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు కనిపించినా సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ఎస్‌పీవీ ఉషారాణి పాల్గొన్నారు.

పెదవేగిలో..

పెదవేగి: విద్యుత్ మీటర్లు ఇకపై అవసరమైన వారు గ్రామ సచివాలయాలలోనే దరఖాస్తు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రుూన్సీ లక్ష్మి తెలిపారు. గురువారం పెదవేగిలోని విద్యుత్ ఉపకేంద్రంలో రైతులు, గ్రామ లైన్‌మెన్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యవసాయ అవసరమైన, లేక గృహ అవసరమైన విద్యుత్ మీటర్లు అవసరమైన వారు గ్రామ సచివాలయాలలో ప్రభుత్వాలు నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించి మీటర్లు పొందవచ్చునని, అదనంగా ఎవరికి ఎటువంటి రుసుము కూడా చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీ పి.శ్రీనివాసరావు, ఏఈ నాగ శేషుడు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువల ద్వారానే విద్య పరిపూర్ణం



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

భీమడోలు: నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే పరిపూర్ణ విద్యార్థులుగా మారతారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని గుండుగొలను, ఆగడాలలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెన్త్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలి? పదో తరగతి తర్వాత చేరే కోర్సులు, నైతిక విలువలతో కూడిన విద్య తదితర అంశాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల చైర్మన్ గుల్ల నూకరాజు అధ్యక్షత వహించారు. తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మార్చి నెలల్లో జరిగే పదో తరగతి పరీక్షలకు చక్కని ప్రణాళికలను సిద్ధం చేసుకుని అందుకు తగినట్లుగా చదివితే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చునన్నారు. అనంతరం ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహాలు, జ్ఞాపికలను అందించారు. డిక్షనరీలను బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సునీత, సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ ఆర్. గంగాధరరావు, మాజీ మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాం



మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ప్రయాణం చేసి విజయం సాధించామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు అన్నారు. గురువారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో నాయకులు, మండల స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు వారి అవసరాలను నాయకులకు వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్ బాబు మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లామని చెప్పారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తావెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టితో మోనటరింగ్ చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసులు, పెదవేగి సొసైటీ ప్రెసిడెంట్ పెనుమాక వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేషన్‌లో ఉపాధి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆయా కోర్సులపై అవగాహన పెంచుకోవాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డా.పి నిర్మల కుమారి అన్నారు. గురువారం డిగ్రీ కాలేజీలో జూనియర్ ఇంటర్, హైస్కూలు విద్యార్థులకు డిగ్రీ కాలేజి ఐక్యూఏసి విభాగం ఆధ్వర్యంలో ఓపెన్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న కోర్సుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ నిర్మలకుమారి మాట్లాడుతూ తమ కళాశాలలో యూజీ స్థాయిలో అందుబాటులో ఉన్న సింగిల్ మేజర్ యూజీ కోర్సులు, మౌలిక సదుపాయాలు గురించి వివరించారు. తమ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ మూడో సంవత్సరం చదువుతూ క్యాంపస్ ఎంపికల్లో ఉద్యోగాలు పొందిన వారిని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, వైస్ ప్రిన్సిపాల్ మధురాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వై.సురేష్ బాబు

పెదవేగి: రహదారి కూడళ్లను దాటేటప్పుడు తప్పకుండా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ వై.సురేష్ బాబు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల పరిధిలోని ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశనుంచే రహదారి భద్రతా నియమాలపై, ట్రాఫిక్ సిగ్నల్స్ పై అవగాహన కలిగి ఉండడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రోడ్డు భద్రతా వైద్యురాలు జి. మౌనిక పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనకు ఏర్పాట్లు



ఎలుక బొరియలు గుర్తించి జెండాలు పాతుతున్న రైతులు

గణపవరం: రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలనకు సిద్ధంగా ఉండాలని శుక్రవారం రైతులంతా ఒకేసారి ఎలుకల మందును పెట్టాలని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ అన్నారు. గురువారం గణపవరం మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ముప్పర్తిపాడు గ్రామంలో పొలాలలో తిరిగి ఎలుకల బొరియలను గుర్తించి, వాటిని మట్టితో కప్పి జండాలు పాతించారు. తెల్లారేసరికి ఏ బొరియలు తెరుచుకుని ఉంటాయో వాటిలో ఎరను ఉంచి, బొరియ పూడ్చి వేయాలని చెప్పారు. శుక్రవారం ఉదయం అన్ని గ్రామాల్లో రైతులకు ఎలుకల మందును ఉచితంగా అందజేస్తామన్నారు. 96 శాతం నూకలు, 2 శాతం నూనె, 2 శాతం బ్రొమోడయోలిన్ కలిపిన ఎరను రైతులంతా ఆయకట్టులో ఒకేసారి మందుపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసి సభ్యులు పిల్లి సంతోషం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఏ కేసు నమోదు



గుండుగొలనులో రేషన్ షాపును పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ ఏ.మాధవరావు

భీమడోలు: గుండుగొలనులోని రేషన్ దుకాణంపై సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేశారు. 250 కేజీల బియ్యం స్టాక్ వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. గ్రామంలో రేషన్ బియ్యం అక్రమంగా బయటకు తరలిపోతున్నాయని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో భీమడోలు సీఎస్‌డీటీ ఏ.మాధవరావు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం రాత్రి రేషన్ షాపుపై ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. రేషన్ షాపు నెం.16ను నిర్వహిస్తున్న డీలర్ ఎం.గౌతమ్‌కుమార్ తన వద్ద ఉన్న ఉండాల్సిన స్టాక్ కన్నా 250 కేజీల బియ్యం తక్కువగా ఉన్నట్లు సంబంధిత అధికారులు నిర్ధారించారు. అతనిపై 6ఏ కేసు నమోదు చేశారు. స్టాక్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని దుకాణం నెం.18కు స్టాక్‌ను అప్పగించారు. ఈ తనిఖీల్లో వీఆర్వో గోవింద్ పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణపై అవగాహన

పెదపాడు: మండలంలో జాతీయ నులిపురుగుల నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టరు చక్రధర్ గురువారం విలేకరులకు తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాలలోపు వయస్సున్న మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలల్లోను, కళాశాలల్లోను ఫిబ్రవరి 9న నులిపురుగుల నివారణ మాత్రలను ఉచితంగా అందిస్తారని చెప్పారు, పాఠశాలలకు వెళ్లని పిల్లలకు కిశోరబాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తారని చెప్పారు. 9న మాత్ర వేయని వారంతా ఫిబ్రవరి 16న జరిగే మాప్ అప్ రోజు వేయాలని సూచించారు. మాత్ర గొంతులో ఇరుక్కోకుండా ఉండేందుకు చప్పరించి గానీ, తాగునీటితో కలిపి మింగాలని డాక్టరు చక్రధర్ సూచించారు.

వైభవంగా ఉరుసు మహోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తంగెళ్ళమూడి రాణీ నగర్‌లోని హజరత్ నజీ ముల్లా హజారీ రహంతుల్లా మహాత్ముని ఉరుసు మహోత్సవాలు గురువారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఫాతెహా ఖానీ భక్తి శ్రద్ధలతో నిర్వహించగా అనంతరం మత పెద్దలు దువా ప్రార్థనలు జరిపారు. అనంతరం దర్గా వంశపారంపర్య ముజావరు ఖాజా హుస్సేన్ , పాత మసీదు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది హిందూ, ముస్లింలు పాల్గొని మహాత్ముని ప్రసాదం స్వీకరించారు.

బీసీల పక్షపాతి సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, చిత్రంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రసాదరావు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా బీసీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ రాజకీయ, సామాజిక సమతుల్యానికి విశేష కృషి చేస్తున్నారని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు తెలిపారు. ఏలూరు ఆర్‌ఆర్ పేటలోని రవి స్వీట్‌హోం ఎదురుగా ప్రైవేటు ఫంక్షన్ హాలులో నగరంలోని కొప్పులవెలమ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు రవిస్వీట్స్ హోం రంగారావుతో కలిసి గురువారం సాయంత్రం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని, ఏలూరు నియోజకవర్గంలో బీసీలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్ళ నానికి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. అదే విధంగా పార్టీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌ను నియమించారని, ఆయన విజయానికి బీసీ వర్గాలన్ని ఐక్యంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు ఏలూరు ఎంపీ అభ్యర్థిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించడం పట్ల బీసీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి, కొప్పుల వెలమ సంఘ పెద్దలు ఉన్నారు.

రంగస్థల కళాకారుడు చల్లా సూరి మృతి



ఉంగుటూరు: రంగస్థల కళాకారుడు చల్లా సూర్యారావు(64) గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల ఆయన కాలుకు దెబ్బ తగిలింది. అయితే షుగర్ వ్యాధి ఉండడంతో దెబ్బ తగ్గలేదు. దీంతో ఆరోగ్యం క్షీణించి గురువారం మృతి చెందారు. అయితే ఇటీవలే ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూరిను పరామర్శించారు. చింతామణి నాటకంలోని సుబ్బిశెట్టి పాత్రలో ఆయన తన మార్క్‌ను చూపించేవాడని, ఆయన మృతి తీరని లోటు అని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డేపల్లి అప్పారావు అన్నారు. గురువారం ఆయన ఇతర రంగస్థల కళాకారులతో కలిసి సూరి మృతదేహానికి నివాళులర్పించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తన పరిధిలో పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం స్పష్టం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అబ్రహంను గురువారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అబ్రహం మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరగా ఏపీటీఎఫ్ నాయకులు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.